19092024-DIS-04_Layout 1 9/19/2024 2:38 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# లెబనాన్‌లో పేజర్ పేలుళ్లు

**లెబనాన్‌లో** జరిగిన పేజర్ల వరుస పేలుళ్లు ప్రపంచాన్ని దిగ్భ్రాంతిలో ముంచాయి. అరచేతిలో ఇమిడే సమాచార పరికరాలు పేలడంతో వేల సంఖ్యలో జనం గాయపడటమే కాకుండా, 10 మందికి పైగా మరణించినట్టు వార్తలు వెలువడ్డాయి. అయితే, ఈ దాడులకు గురైనవారు సామాన్య పౌరులు కారు. వారంతా సాయుధ మిలిటెంట్ దళం హెజ్బొల్లాకు చెందినవారు కావడం గమనార్హం. ఏక కాలంలో వేర్వేరు చోట్ల జరిగిన పేలుళ్ల దృశ్యాలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించాయి. ప్రధానంగా హెజ్బొల్లాకు గట్టి పట్టున్న దక్షిణ లెబనాన్‌లో ఈ పేలుళ్లు సంభవించాయి. లెబనాన్ ప్రభుత్వాధినేతలు ఈ దాడి వెనుక ఇజ్రాయెల్ హస్తం ఉన్నట్టు ఆరోపిస్తున్నారు. అయితే, ఇజ్రాయెల్ సైన్యం ఈ ఆరోపణను ఖండించింది. అయితే, దీన్ని పెద్దగా ఎవరూ విశ్వసించడం లేదు. తైవాన్ నుంచి రవాణా అవుతున్న పేజర్లను దారి మళ్లించి వాటిలో పేలుడు పదార్థాలను, సూక్ష్మ డిటోనేటర్లను అమర్చారని వెలువడుతున్న వార్తలు విస్మయం కలిగిస్తున్నాయి.

ఇరాన్ వత్తాసుతో ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడుతున్న హెజ్బొల్లాకు ఈ పేలుళ్లు గట్టి ఎదురుదెబ్బ అనే మాట ఈ సందర్భంగా వినవస్తున్నది. ఎప్పుడో 1990లలో కొన్నాళ్లపాటు ఓ వెలుగు వెలిగి, సెల్‌ఫోన్ల రాకతో అంతర్ధానమైపోయిన పేజర్లను లెబనాన్ మిలిటెంట్లు ఇప్పటికీ ఉపయోగిస్తుండటం, వాటిద్వారానే పేలుళ్లు జరగడం విస్మయం కలిగిస్తున్నది. తనిఖీల్లో, నిఘాలలో పట్టుబడకపోవడం వల్లనే మిలిటెంట్లు వీటిని ఉపయోగిస్తున్నట్టు తెలుస్తున్నది. ఎందుకంటే పేజర్లను పెద్ద సంఖ్యలో ఉపయోగించి పేలుళ్లు జరిపిన ఉదంతం ఏదీ ఇదివరకు నమోదు కాలేదు. గతంలో 1971 మ్యూనిక్ ఒలింపిక్స్‌లో తమ క్రీడాకారులను చంపిన ఉగ్రవాదులను వేటాడటానికి ఇజ్రాయెల్ ల్యాండ్‌లైన్ టెలిఫోన్లను వాడిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియా ఘర్షణల్లో సాంకేతికత రోజుకో రకంగా పరిణమించడం చూస్తుంటే చివరికి దేనికి దారితీస్తుందోననే అనుమానం కలుగక మానదు.

పశ్చిమాసియా సంక్షోభంలో భాగమైన గాజా యుద్ధం ఓ వైపు ఎడతెరిపి లేకుండా సాగుతున్నది. ఇప్పటికే భారీసంఖ్యలో పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు మహిళలు, చిన్నారులే కావడం అత్యంత విషాదకరం. గాజాలో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడుతున్నదని దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసువేసింది. ఈ పరిస్థితిపై అమెరికాలోనూ ఇటీవల యుద్ధ వ్యతిరేక నిరసనలు భగ్గుమనడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అగ్రరాజ్యం మధ్యవర్తిత్వ పాత్రకు సిద్ధపడి పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. కానీ, ఆ ప్రయత్నాలు ముందుకువెళ్తున్న సూచనలు కనిపించడం లేదు. పైగా ఘర్షణలు సరికొత్త మలుపులు తిరుగుతుండటం ప్రపంచ దేశాలను కలవరపరుస్తున్నది.

# ఇది ప్రజాకంటక పాలన!

**దేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజు(సెప్టెంబర్ 17)ను కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజాపాలన దినోత్సవం'గా జరిపింది. పేరులోనే ప్రజాపాలన ఉన్నది కాబట్టి, అద్భుతం, అమోఘం అని చాలామంది కీర్తించారు కూడా. అయితే, మనం ఓ తొమ్మిది నెలలు వెనక్కి వెళ్తే, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రోజులవి. తెలంగాణలో ప్రజాపాలన తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో చెప్పింది. అధికార పీఠం మీద కూర్చోగానే ప్రజాపాలన మొదలుపెడతామని గొప్పగా ప్రచారం చేసింది.**

**కానీ, రాష్ట్రంలో ఇప్పుడేం జరుగుతున్నది? నేతి బీరకాయలో నెయ్యి ఎలా ఉండదో.. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం ఉండదని.. కాంగ్రెస్ పాలకులకు ప్రజలు, ప్రజా సంక్షేమం అంటే అస్సలే పట్టవని ఈ తొమ్మిది నెలల్లో తేలిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ పాలన నడుస్తున్నదంటే ప్రజాకంటక పాలన నడుస్తున్నది.**



**వై.సతీష్‌రెడ్డి**
**96414 66666**



సెప్టెంబర్ 17 నేపథ్యంలో ప్రజాపాలన పేరును కాంగ్రెస్ సర్కార్ మరోసారి తెరమీదికి తెచ్చింది. ప్రజాపాలన అంటే ఏమిటో, ఎలా ఉంటుందో ఈ తొమ్మిది నెలల్లో మనకు అనుభవంలోకి వచ్చింది. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, ప్రజా హక్కులను కాలరాస్తూ, ప్రశ్నించినవారిపై దాడులు చేయడమే కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన. అంతేకాదు, ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడమనేది ఈ ప్రజాపాలనలో ముఖ్యాంశం. ఇది ప్రజా పాలన కాదు, ప్రజాకంటక పాలన.

పంటలకు నీళ్లు రావడం లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన రైతుల ఇండ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడమే ప్రజా పాలన. నిండు వానకాలంలోనూ పంటలు ఎండిపోతున్నాయి. వరి పొలాలు నెర్రెలు బారాయి. కాలువల ద్వారా నీళ్లిచ్చి అన్నదాతలను ఆదుకోవాలన్న సోయి పాలకులకు లేదు. దశాబ్దం కిం దట తెలంగాణ ప్రాంతంలో ఎరువులు, విత్తనాల దుకాణాల ముందు కనిపించిన చెప్పుల లైన్లు ఇప్పుడు మళ్లీ తిరిగొచ్చాయి. నాడు పోలీస్‌స్టేషన్లలో ఎరువులు పంచినట్టుగానే ఇప్పుడు పోలీసు పహారాలో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. పంట వేయడానికి కొద్దిరోజుల ముందే ఠంచన్‌గా అకౌంట్‌లో పడే రైతుబంధు ఆగిపోయింది. రుణమాఫీ పేరుతో మాటల మాయాజాలం చేశారనే విషయం ఇప్పటికే చాలా మంది రైతులకు తెలిసిపోయింది.

అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరుతో దరఖాస్తులను స్వీకరించారు. ఆరు గ్యారంటీల అమలు కోసమే ఈ తతంగమని చెప్పారు. కానీ, ఇప్పటి వరకు అవి ఏమయ్యాయో అతీ గతీ లేదు. ఆరు గ్యారంటీలు, 420 హామీలన్నీ అటకెక్కాయి. 'మేమొస్తే అన్నీ డబుల్' అని చెప్పుకున్నోళ్లు.. కనీసం పాత పింఛన్లు కూడా సరిగా ఇవ్వలేకపోతున్నారు. అంటే.. ప్రజలను బురిడీ కొట్టించి ఇచ్చిన మాట తప్పడమే ప్రజాపాలన కావొచ్చు అన్న అభిప్రాయం కలుగుతున్నది.

అధికారపీఠంపై ఆసీనులైన రోజే ఉమ్మడి నల్లగొండ జిల్లా చింతపల్లిలో ఓ రైతు లాకప్‌డెత్ జరిగింది. రెండు, మూడు రోజులకే బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు మొదలయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు మూడు రాజకీయ హత్యలు జరిగినా ఇప్పటికీ నిందితులను పోలీసులు పట్టుకోలేకపోయారు. ఇటీవల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేపై హత్యాయత్నం జరిగింది. దానికి ముందు మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేల మీద హత్యాయత్నం జరిగింది. ప్రజా సమస్యలపై సోషల్ మీడియాలో పోస్టు పెడితే చాలు దాడులు చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న జర్నలిస్టులపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు, లైంగికదాడులు.. ఇవన్నీ ఇప్పుడు సర్వసాధారణమయ్యాయి. రాష్ట్ర రాజధానిలో నెల రోజుల్లో 30కి పైగా హత్యలు జరగడం.. రుణమాఫీ, రైతుభరోసా అడిగితే దాడులు చేయడం.. వరద పరిహారం అడిగిన బాధితులపై లాఠీచార్జీలు.. ఇవన్నీ ప్రజాపాలన పుణ్యమే. మహిళలపై దాడులను ఖండించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేచురల్ రియాక్షన్స్ ఉంటాయంటూ దాడులకు ఉసిగొల్పడం ప్రజాపాలనలో మనం చూసిన మరో అద్భుత ఘట్టం. ఓవైపు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నడుం కట్టి పోరాడుతున్నామని చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతూ.. మరోవైపు అదే రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే ప్రజా పాలనా?

రాష్ట్రంలో ఏ ఒక్క వ్యవస్థ కూడా సక్రమంగా నడవటం లేదు. తెలంగాణలో శాంతిభద్రతలు పట్టాలు తప్పాయి. అందుకే అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన గురుకుల విద్యాలయాలు నేడు సమస్యలకు నెలవుగా మారాయి. విద్యార్థుల మరణాలు, సిబ్బంది దురుసు ప్రవర్తన, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు.. వెరసి ఒకనాడు సీటు కోసం లైను కట్టిన తల్లిదండ్రులు ఇప్పుడు 'మాకొద్దీ గురుకులాలు' అని పిల్లలను ఇంటికి తీసుకెళ్లే పరిస్థితులు వచ్చాయి. కానీ, ఒకటి మాత్రం నిజం. ఆనాడు హైదరాబాద్ స్టేట్‌గా ఉన్నప్పుడు నిజాం పాలనలో, రజాకార్ల అకృత్యాల మధ్య చవిచూసిన అనుభవాలను ఈ ప్రజాపాలనలో తెలంగాణ ప్రజలు నెమరు వేసుకుంటున్నారు. నయా నిజాం మాదిరిగా రేవంత్‌రెడ్డి తెలంగాణను పాలిస్తున్నారు. నాడు నిజాం పాలకులు ప్రజలపైకి రజాకార్ సైన్యాన్ని ఎగదోసినట్టు ఇప్పుడు తన పార్టీ కార్యకర్తలను, పోలీసులను ప్రశ్నిస్తున్నవాళ్లపైకి ఎగదోస్తున్నారు.

నాటి నిజాం పాలనకు ఏ మాత్రం తీసిపోకుండా ఈ తొమ్మిది నెలల ప్రజాపాలన సాగిందనే సంబురంతోనే ఏమో సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరిపారు. వాస్తవానికి నిజాం పాలన నుంచి బయటకొచ్చి మనం భారతదేశంలో కలిసిన సందర్భంగా విలీన దినోత్సవాన్ని జరుపుకొంటాం. కానీ, ప్రస్తుత సర్కార్ పూర్తిగా నాటి నిజాం పంథాలో, ఒకరకంగా చెప్పాలంటే నిజాం పాలకులకు ప్రతిరూపంగా నిరంకుశ పాలన చేస్తున్నారు కాబట్టి సంబురాలు జరుపుకున్నారు. నాడు నిర్రనీలిగిన నిజాంనే ఈ గడ్డ ఉరికించింది. ప్రజాపాలన పేరుతో నిజాంలా నిరంకుశత్వానికి పాల్పడుతున్న ప్రస్తుత పాలకులు ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిది.

**(వ్యాసకర్త: కన్వీనర్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం)**



# అసమానతల అభివృద్ధి

**2023-24లో ఏపీకి చెందిన ఓ వ్యక్తి సగటు ఆదాయం బీహార్‌లో ఉన్నవారి కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. భవిష్యత్‌లోనూ వృద్ధి రేట్లు గత ట్రెండ్లకు అనుగుణంగానే ఉంటాయని అనుకుందాం. అయినప్పటికీ, ఈ దశాబ్దం చివరి నాటికి రెండు రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల సగటు ఆదాయం మధ్య అంతరం నాలుగున్నర రెట్లు ఉండే అవకాశం ఉంది.**



**ఇషాన్ బక్షి**

ఇప్పుడు ఈ రెండు రాష్ట్రాల వృద్ధి పథాలను తారుమారు చేసి చూద్దాం. ఈ లెక్కన కూడా 15 ఏండ్ల తర్వాత బీహార్‌కు చెందినవారి కంటే ఏపీవాసుల తలసరి ఆదాయమే ఎక్కువగా ఉంటుంది. దక్షిణాదిలోని ధనిక రాష్ట్రాలన్నింటిలో ఏపీ తలసరి ఆదాయం తక్కువ కావడం గమనార్హం. ఇక్కడ ఏపీ, బీహార్ అనేవి ఉదాహరణ మాత్రమే. ఆంధ్రా స్థానంలో ఇతర దక్షిణాది రాష్ట్రాలను, బీహార్ స్థానంలో ఉత్తర, మధ్య, తూర్పు భారత్‌లోని ఇతర రాష్ట్రాలను తీసుకొని పోల్చి చూసినా ఈ అంశంలో పెద్దగా మార్పేమీ కనిపించదు.

ప్రభుత్వ విధానాలు, మార్కెట్ శక్తుల ద్వారా దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయి. ఐటీ సెక్టార్ చాలావరకు దక్షిణాదిలోనే ఉన్నది. దేశంలోని 37 శాతం వరకు పరిశ్రమలు దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. అంతేకాదు, ఈ ఐదు రాష్ట్రాల్లో 33 శాతం మంది ఉద్యోగులు ఉన్నారు. దేశవ్యాప్తంగా ఎగుమతుల్లో టాప్-20లో ఉన్న జిల్లాల్లో రెండు మినహా మిగతావన్నీ దక్షిణాది, పశ్చిమ రాష్ట్రాల్లోనే ఉన్నాయి. 1990ల్లో ఈ రాష్ట్రాలు దేశ జీడీపీలో సుమారుగా పావు వంతు వాటా కలిగి ఉండేవి. కానీ, 2022-23 నాటికి ఈ రాష్ట్రాల వాటా మూడొంతులకు చేరుకున్నది. దీన్ని ఆయా రాష్ట్రాల జనాభా ప్రకారం చూసినట్టయితే, ఈ సంఖ్య మరింతగా పెరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలు మాత్రమే ధనికం కాదు, అక్కడి ప్రజలు విద్యావంతులు, వారి పిల్లలు ఆరోగ్యవంతులు, వారు ఎక్కువగా కాలం జీవిస్తారు.

> **యూపీ, బీహార్‌లో చాలా తక్కువకే శ్రామిక శక్తి లభిస్తున్నప్పటికీ, కంపెనీలు అక్కడికి తరలించడానికి అది ఏ మాత్రం సరిపోదు. నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, మౌలిక వసతులు, ఆర్థిక పరిపుష్టి తదితర అంశాలు దక్షిణ, పశ్చిమ రాష్ట్రాలకు అనుకూలం. హైదరాబాద్, చెన్నై, ముంబై, పుణె లాంటి నగరాల్లో యాపిల్, ఫాక్స్‌కాన్ లాంటి అంతర్జాతీయ సంస్థలను ఎక్కువగా నెలకొల్పుతున్నారు. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఐదు సెమీకండక్టర్ ప్రాజెక్టుల్లో నాలుగు గుజరాత్‌లోనే ఏర్పాటవుతుండటం గమనార్హం.**

ఢిల్లీకి సమీపంగా ఉన్న కారణంగా నోయిడా, ఘజియాబాద్ లాంటి కొన్ని నగరాలు లబ్ధి పొందుతున్నాయి. యూపీలో ఈ రెండు నగరాల్లోనే 46 శాతం వేతన జీవులు ఉన్నారు. హైవేలు, విమానాశ్రయాల నిర్మాణం ద్వారా యూపీలోని కొన్ని ప్రాంతాలకు ఆర్థిక ఊపు రావడం తప్ప, దాని వల్ల అంతకుమించి ఏం జరుగుతుంది?

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వృద్ధిరేటులో కొనసాగుతున్న వైవిధ్యం కారణంగా పేద రాష్ట్రాల నుంచి ధనిక రాష్ట్రాలకు వలసలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అధిక జనాభా ఉండే రాష్ట్రాల్లో అధిక జనాభా పెరుగుదల రేటు, తక్కువ ఉపాధి అవకాశాలు ఉంటాయి. దీని కారణంగా దక్షిణాది, పశ్చిమ, ఉత్తర భారత్‌లోని కొన్ని నగరాలపై మరింత ఒత్తిడి పెరుగుతున్నది. ఈ వలసల ప్రభావం ధనిక ప్రాంతాల్లోని స్థానికుల నుంచి ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు దారితీసే ప్రమాదం ఉంది. ఉద్యోగాల కొరత కారణంగా తక్కువ ఆదాయ రాష్ట్రాల్లోని కొన్ని వర్గాలు కూడా ఇలాంటి డిమాండ్ చేసే అవకాశం ఉంది.

> **సైద్ధాంతిక ధోరణితో సంబంధం లేకుండా పాపులిజానికి ప్రభుత్వాలు ఎక్కువగా ప్రాధాన్యమిస్తాయి. తక్కువ నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను సృష్టించడంలో తమ అసమర్థత, వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి దక్షిణాది లాంటి ధనిక ప్రాంతాల నుంచి ఆర్థిక వనరుల బదిలీని ప్రభుత్వం ఎంచుకుంటుంది.**

ఏదేమైనప్పటికీ, ఒక దేశ చరిత్రలో 15 ఏండ్లు ఎక్కువ సమయమేమీ కాదు. కానీ, అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. దేశంలోని తక్కువగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో వృద్ధికి అవరోధంగా ఉన్నవాటిని తొలగించడానికి, సమస్యలను పరిష్కరించడానికి ఈ సమయం సరిపోతుంది.

**'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో...**

**ఆమె ఎక్కడా వణకలేదు, బెణకలేదు, తొణకలేదు. ఒత్తిడిని తన దరిదాపుల్లోకి రానివ్వలేదు. ప్రత్యర్థిని మాటల తూటాలతో చీల్చిచెండాడారు. తన విధానాలను విస్పష్టంగా వివరించారు. ప్రత్యర్థి ప్రశ్నలకు దీటుగా సమాధానాలిచ్చారు. అమెరికాను అగ్రభాగాన నిలిపేందుకు తనకంటూ ఒక విజన్ ఉందని నొక్కిచెప్తూనే, ప్రత్యర్థి వద్ద ఎలాంటి ప్రణాళికలు లేవని కుండబద్దలు కొట్టారు. ప్రతి అంశంలోనూ ఆధిక్యత కనబరిచి స్పష్టమైన ఆధిపత్యం చెలాయించారు. జాతీయ నుంచి అంతర్జాతీయ యుద్ధాల వరకు తన వైఖరిని విస్పష్టంగా వెల్లడించిన అమెరికా నల్లకలువ కమలా హ్యారిస్ అగ్రరాజ్యంతో పాటు ప్రపంచాన్ని మైమరిపించారు.**

# అధ్యక్ష పీఠం వైపు అతివ!



**సట్ల మురళీకృష్ణ**
**94411 74565**



రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో ఫిలడెల్ఫియాలో జరిగిన తొలి డిబేట్‌లోనే డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహ్యారిస్ తన సత్తా ఏమిటో చాటిచెప్పారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ట్రంప్‌కు మూడు చెరువుల నీళ్లు తాగించారు. డిబేట్ ప్రారంభానికి ముందే తన సహజసిద్ధమైన చిరునవ్వుతో ప్రత్యర్థితో కరచాలనం చేసిన కమలా అమెరికన్లను ఆకట్టుకున్నారు. తడబడకుండా, ఒత్తిడికి గురికాకుండా, కొండంత ఆత్మవిశ్వాసంతో సుత్తి లేకుండా, ముక్కుసూటిగా డిబేట్ చివరి వరకు ఆమె మాట్లాడి అందరి మన్ననలు పొందారు. అంతేకాదు, విమర్శలకు ప్రతివిమర్శలు చేస్తూ, సవాళ్లకు ప్రతిసవాల్ విసురుతూ ఎక్కడా తగ్గేదేలేదని నిరూపించారు. ఈ క్రమంలో లీగల్ విభాగంలో ప్రాసిక్యూటర్‌గా గతంలో ఆమెకున్న అనుభవం ఎంతగానో కలిసొచ్చింది. ఆర్థిక సంక్షోభం నుంచి యుద్ధాల వరకు సాగిన ఈ డిబేట్‌లో కమలా హ్యారిస్ పైచేయి సాధించారని చెప్పడానికి అమెరికన్ మీడియా ఆమెను ఆకాశానికి ఎత్తిన తీరే నిదర్శనం.

ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలో జరిగిన మొదటి డిబేట్‌లో బైడెన్‌పై ట్రంప్ స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అనంతర పరిణామాల నేపథ్యంలో బైడెన్ నిష్క్రమణ, ఆయన స్థానంలో కమలా హ్యారిస్ అభ్యర్థిగా బరిలో నిలవడంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. అప్పటివరకు గెలుపు ధీమాతో ఉన్న ట్రంప్‌లో నిరాశ, నిస్పృహ ఆవహించాయి. అనూహ్యంగా తెరపైకి వచ్చిన కమలా హ్యారిస్ గంటల వ్యవధిలోనే మెజారిటీ పార్టీ ప్రతినిధులు, కీలక నేతల మద్దతును కూడగట్టుకున్నారు.

> **ప్రజామోదం నేపథ్యంలో మొదట కినుక వహించిన మాజీ అధ్యక్షుడు ఒబామా సైతం ఆమెకు మద్దతివ్వాల్సి వచ్చింది. భారీగా విరాళాల సేకరణతో కమల గ్రాఫ్ రోజురోజుకు పెరుగుతూ పోయింది. దీంతో అప్పటి వరకు ఓడిపోతామని నైరాశ్యంలో ఉన్న డెమోక్రటిక్ వర్గాల్లో ఒక్కసారిగా జోష్ వచ్చింది. వారి ఆత్మస్థైర్యం అమాంతం పెరగగా.. ట్రంప్ మద్దతుదారుల్లో నిస్పృహ అలుముకున్నది.**

కమలా హ్యారిస్ అతితక్కువ సమయంలోనే ట్రంప్‌కు కొరకరాని కొయ్యలా మారారు. భారతీయ మూలాలున్న కమలాహ్యారిస్‌కు స్వతహాగానే భారతీయులు మద్దతుగా నిలుస్తున్నారు. తండ్రి వారసత్వం వల్ల నల్లజాతీయులు కూడా ఆమెకు జై కొడుతున్నారు. దీంతో అధ్యక్ష పీఠం దిశగా ఆమె రేసుగుర్రంలా దూకుడుగా దూసుకుపోతున్నారు. ఓవైపు తన మాటలతో అమెరికన్లను మంత్రముగ్ధుల్ని చేస్తూనే.. మరోవైపు విమర్శలతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. ఏ మాత్రం అలసత్వం వహించకుండా ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.

నల్లజాతి ఓటర్లలో 69 శాతం మంది నల్లకలువకే మద్దతు తెలుపుతున్నట్టు సర్వేలు తేల్చిచెప్తున్నాయి. దీంతో శ్వేత సౌధం ముమ్మాటికీ తమదేనని కమల మద్దతుదారులు ధీమాగా ఉండటంతో ట్రంప్‌కు ఓటమి భయం పట్టుకున్నది. అందుకే ఆయన జాతులు, వర్గాల మధ్య చిచ్చుపెడుతూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు.

ప్రస్తుత డిబేట్ ద్వారా మధ్యతరగతి మద్దతును కమలాహ్యారిస్ కూడగట్టుకున్నారు. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు ఉన్న ప్రాధాన్యాన్ని, పెద్దన్న పాత్రను కాపాడుతారనే విశ్వాసాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో నవంబర్ 5న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో కమలాహ్యారిస్ గెలుపు ఖాయంగా కనిపిస్తున్నది.

> **నల్లజాతి ఓటర్లలో 69%మంది నల్లకలువకే మద్దతు తెలుపుతున్నట్టు సర్వేలు తేల్చి చెప్తున్నాయి. దీంతో శ్వేత సౌధం ముమ్మాటికీ తమదేనని కమల మద్దతుదారులు ధీమాగా ఉండటంతో ట్రంప్‌కు ఓటమి భయం పట్టుకున్నది. అందుకే ఆయన జాతులు, వర్గాల మధ్య చిచ్చుపెడుతూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు.**

# పేదలపై అక్కసేలా?

**'పోలీసులు మా బ్యాగ్, బుక్స్ తీసుకునే టైం కూడా ఇవ్వకుండా ఇళ్లను కూల్చివేశారు. ఇప్పుడు ఎట్లా చదువుకోవాలో మాకు అర్థం కావడం లేదు' అంటూ హైడ్రా దురాగతాలను వివరిస్తూ అభం శుభం తెలియని చిన్నారి కన్నీటి పర్యంతమైన తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతల కారణంగా పేదలు పడుతున్న కష్టాలు, తీస్తున్న కన్నీళ్లు, పెడుతున్న ఆక్రందనలు అన్నీ ఇన్నీ కావు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలిచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీలు ఎక్కడికక్కడ పేరుకుపోయేసరికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొత్తగా 'హైడ్రా'మాకు తెరదీసింది. సీఎం రేవంత్ చేసే ఈ రాజకీయాలను 'డైవర్షన్ పాలిటిక్స్' అని ఘంటాపథంగా వర్ణించవచ్చు.**



**జీడిపల్లి రాంరెడ్డి**
**96666 80051**



గ్రేటర్ హైదరాబాద్ నగర పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా ఏర్పాటు చేసిన హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) వ్యవహారం రోజురోజుకు వివాదాస్పదం అవుతూనే ఉన్నది. గతంలో జంట నగరాల కేంద్రంగా వందలాది చెరువులుండేవి. వాటిని కబ్జాదారులు ఆక్రమణ చేసి, నిర్మాణాలూ చేశారు. ఇదంతా ఒకటీ, రెండు రోజుల్లో జరిగిన తతంగం కాదు. కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే ఈ నిర్మాణాలు మొదలయ్యాయి. హైదరాబాద్ చుట్టూరా ధనవంతులు, రాజకీయ నాయకులు, సినిమా, వ్యాపారవేత్తలు చెరువులను, కుంటలను ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులైతే పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లను నిర్మించి మధ్య తరగతి ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ నిర్మాణాలకు పదో, పరకో తీసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇవ్వడంతో అక్రమ నిర్మాణాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విస్తరించాయి. చెరువులను కబ్జా చేయడంతో వాటి నీటి నిల్వ పరిధి (ఎఫ్‌టీఎల్) రానురాను కుంచించుకుపోయింది. అనుమతులు ఇచ్చే సమయంలో చెరువులు, కుంటలను కాపాడాల్సిన నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు ఏం చేశారన్నది సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది. దీంతో మహా నగరమైన హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడ్డప్పుడల్లా పలు కాలనీలు నీటిలో మునిగిపోతున్నాయి. ఇంత పెద్ద నగరానికి ఒక పటిష్ఠమైన భవిష్యత్తు ప్రణాళిక లేకపోవడం విచారించదగిన విషయమే.

అయితే రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా అధికారులు ముందుగా చేయవలసిన పని ఏమంటే... హైదరాబాద్‌లో మొత్తం ఎన్ని చెరువులున్నాయి? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఏ మేరకు ఆక్రమణలు జరిగాయి? ఆక్రమించిన వారి వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆక్రమణదారులకు ముందుగా నోటీసులు ఇచ్చి, ఆ తర్వాతే కూల్చివేత పనులు షురూ చేయాలి. అయితే, కబ్జా చేసిన ధనవంతుల నిర్మాణాలను కూల్చితే సమస్యేమీ లేదు. కానీ, పేద, మధ్య తరగతి ప్రజల నిర్మాణాలను కూల్చితేనే అసలు సమస్య. వాళ్లు పైసా పైసా పోగు చేసుకొని కొనుక్కున్న, లేదా కట్టుకున్న ఇండ్లు అవి. అలాంటి నిర్మాణాలను కూలిస్తే వాళ్లు పడే బాధ వర్ణనాతీతం. కబ్జాలకు ప్రధాన కారణం అసలు వీళ్లేనా, కాదా అని ఒక్కసారి తనిఖీ చేయాలి. ఒకవేళ వాళ్లే అయితే, అక్రమ నిర్మాణాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపవలసిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉన్నది. అయితే, ఈ కబ్జా పర్వంలో భాగస్వాములైన నీటిపారుదల, మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులను తప్పుపట్టాల్సిన అవసరం లేదా అని ఒక్కసారి ప్రభుత్వం అవలోకనం చేసుకోవాలి. అధికార యంత్రాంగం పటిష్ఠంగా ఉంటే అసలు అక్రమ నిర్మాణాలు జరిగేవే కావనేది వేరే విషయం.

> **గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక కాలనీలో నిర్మించిన ఆక్రమణలు కూల్చివేసినప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా రేవంత్‌రెడ్డి.. 'నిర్మితమై ఉన్నవాటిని కూల్చడం పద్ధతి కాదు, ఎంతో కొంత జరిమానా విధించి ఆ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద లేదా?' అని ప్రశ్నించారు. నేడు ఆ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.**

నాడు పేదల పక్షాన నిలిచిన రేవంత్ రెడ్డి, నేడు పేదల ఇండ్లను కూల్చడం సరైన నిర్ణయమేనా? అని ఆయన ఒక్కసారి ప్రశ్నించుకోవాలి. 'హైడ్రా' విధానం మంచిదే కావచ్చు కానీ, తెలిసో, తెలియకో ఎవరో అమ్మిన భూములను, భవనాలను కొనుక్కున్న మధ్య తరగతి ప్రజలు ఎందుకు బలి కావాలి? ఇలాంటివారికి ప్రభుత్వం భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదా? ఇలాంటివాళ్లకు ప్రభుత్వం వేరేచోట ఇంటి స్థలాలను కేటాయించాలి. అప్పుడే 'హైడ్రా' చేస్తున్న పనికి అర్థం ఉంటుంది. అంతేకానీ, హడావుడిగా ఇవి అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేస్తే పేద ప్రజలు రోడ్డున పడతారనే విషయాన్ని ముఖ్యమంత్రి మరిచిపోకూడదు.